పశు బీమా.. పెట్టేశారు కామా..

- వైఎస్సార్ పశు బీమా పథకంపై నీలినీడలు
- కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం
- పాడి రైతులకు భరోసా కరవు





గత ప్రభుత్వ హయాంలో ఆవుకు బీమా చేయించినట్లుగా అధికారులు వేసిన ట్యాగ్‌లను చూపిస్తున్న రైతులు(ఫైల్)

రంగంపేట: పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు ఆపద సమయంలో అండగా నిలబడాలన్న సదుద్దేశంతో జగనన్న ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన వైఎస్సార్ పశువుల బీమా పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. అప్పట్లో లబ్ధిదారులు సగం ప్రీమియం చెల్లిస్తే మిగిలిన 50 శాతాన్ని ప్రభుత్వమే చెల్లించేది. అదే ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులైతే 20 శాతం ప్రీమియం చెల్లిస్తే చాలు మిగిలిన 80 శాతం ప్రీమియాన్ని ప్రభుత్వమే కట్టేది. పశుసంవర్ధక శాఖ అధికారులే పాడిరైతుల వద్దకు వెళ్లి పశుబీమా పథకంపై అవగాహన కల్పించి బీమా చేయించేవారు. దీనివల్ల ప్రమాదవశాత్తూ పశువులు మరణిస్తే పాడి రైతులను బీమా ఆదుకునేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడిచినా పశు బీమా ఊసే లేదు. వైఎస్సార్ పశు బీమా పథకాన్ని అటకెక్కించే యోచనలో కూటమి ప్రభుత్వం ఉన్నట్లుగా వార్తలు హల్‌చల్ చేస్తుండడంతో పాడి రైతులంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆపద్బాంధవి వైఎస్సార్ పశు బీమా

వైఎస్సార్ పశు బీమా పథకం పాడి రైతుల పాలిట ఆపద్బాంధవిగా నిలిచేది. ఉత్పాదక దశలో ఉన్న 2–10 ఏళ్ల లోపున్న ఆవులు, 3–12 ఏళ్ల వయసున్న గేదెలకు రూ.30 వేలు, ఏడాదిన్నర వయసున్న మేలు జాతి ఎద్దులు, దున్నలకు రూ.30 వేలు, రెండేళ్లకు పైబడిన ఎద్దులు, దున్నలు, నాటు ఆవులకు రూ.15 వేలు, ఆరు నెలల వయసు పైబడిన మేకలు, గొర్రెలు, పందులకు రూ.6 వేలు చొప్పున వైఎస్సార్ పశు బీమా పథకం వర్తింపజేసేవారు. ప్రకృతి వైపరీత్యాలు వరదలు, తుపానులు, పాము కాటు, అడవి జంతువుల దాడి, పిడుగులు, అగ్ని ప్రమాదం, రోడ్డు, రైలు ప్రమాదాలతో పాటు జబ్బుతో పశువులు మృత్యువాత పడితే బీమా వర్తించేది. అంతేకాదు ఎస్సీ, ఎస్టీ పాడి రైతులకు 80 శాతం సబ్సిడీపై బీమా అందించేవారు. ఎస్సీ, ఎస్టీ పాడి రైతులు 20 శాతం లబ్ధిదారుల శేరు ధనాన్ని, ఇతరులు 50 శాతం ప్రీమియాన్ని చెల్లిస్తే మిగిలిన ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించేది. ఆవు, గేదెలకు బీమా రూ.15 వేలకు గాను ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు రూ.192 మాత్రమే ప్రీమియం చెల్లిస్తే మిగిలిన రూ.768 ప్రభుత్వం చెల్లించేది. అదే మేకలు, గొర్రెలు, పందులకు ఏడాదికి ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు ఏడాదికి కేవలం రూ.36 కడితే, ప్రభుత్వం మిగిలిన రూ.144 ప్రీమియం చెల్లించేది. ఇంతటి మహత్తర పథకాన్ని కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంపై పాడి రైతుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల్లో పశు సంపద

నియోజకవర్గం	ఆవులు	గేదెలు	గొర్రెలు	మేకలు	పందులు
అనపర్తి	10,082	25,487	15,192	5,451	657
రాజానగరం	21,129	48,344	78,177	13,674	188

పాడి రైతులకు భరోసా ఏది?



వైఎస్సార్ పశు బీమాతో పాడి రైతులకు భరోసా దొరికేది. విపత్తులు, కరవు కాటకాలు, విద్యుదాఘాతం, పిడుగుపాటు తదితర ప్రమాదాల కారణంగా పశువులు మృత్యువాత పడినప్పుడు బీమా ఆదుకునేది. అంతేకాదు గత ప్రభుత్వం రాయితీపై పశువులకు బీమా అందించేది. ఇప్పుడది లేకుండా పోయింది.

– నలమాటి భీముడు, పాడి రైతు, వడిశలేరు, రంగంపేట మండలం

మార్గదర్శకాలు రావాలి



పశువులకు బీమా చేయించుకోవడం ద్వారా పాడి రైతులకు ఎంతో మేలు చేకూరుతుంది. వైఎస్సార్ పశుబీమా పథకానికి సంబంధించి పాడి రైతుల నుంచి ప్రీమియం కట్టించుకోవడానికి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రావాల్సి ఉంది. అందుకే ప్రస్తుతం బీమాకు సంబంధించి మేము ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించడం లేదు.

– డాక్టర్ టి.శ్రీనివాసరావు, డీఏహెచ్‌ఓ, రాజమహేంద్రవరం

కోరుకొండలో వైద్య సిబ్బంది నిరసన



కోరుకొండలో ధర్నా చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

మధురపూడి: కోల్‌కతాలో వైద్యురాలిని హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ కోరుకొండ పీహెచ్‌సీ వద్ద వైద్య సిబ్బంది సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రజ్ఞ మాట్లాడుతూ దేశంలో ఇలాంటి అమానుష ఘటనలు జరుగుతుండడం దారుణమన్నారు. మహిళలకు రక్షణగా మరిన్ని చట్టాలు తీసుకురావాలన్నారు. నిరసనలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం



శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం జేఎన్ రోడ్డులోని మన్యం గార్డెన్స్‌లో శ్రీనివాస కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. మన్యం సంతోష్ కుమార్, సునీత సౌజన్యంతో ఈ కార్యక్రమం జరిపారు.

క్లుప్తంగా

పెదపూడి ఎస్ఐగా రామారావు



పెదపూడి: పెదపూడి ఎస్ఐగా కె.రామారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఏఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి సాదర స్వాగతం పలికారు. ఆయన ఇప్పటివరకూ అనపర్తి మండలంలో ఎస్ఐగా పనిచేశారు. ఇంతకాలం ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన శోభన్‌కుమార్ కరప మండలానికి బదిలీ అయ్యారు.

అన్నసమారాధన

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల గ్రామంలోని రాజరాజేశ్వరి ఆలయంలో సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అన్న ప్రసాదం స్వీకరించారు. ముందుగా అమ్మవారికి పూజలు నిర్వహించారు.

ఎక్స్‌గ్రేషియా ఇప్పించేందుకు కృషి చేస్తా

బిక్కవోలు: ప్రమాదవశాత్తూ మృతి చెందిన వ్యక్తి కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా ఇప్పించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హామీ ఇచ్చారు. ఇటీవల బిక్కవోలు కేపీఆర్ ఫెర్టిలైజర్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో బత్తిన దుర్గాప్రసాద్ అనే వ్యక్తి ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. అయితే తమ కుటుంబానికి యాజమాన్యం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిందని, కర్మకాండలు పూర్తి చేసుకుని యాజమాన్యాన్ని కలిస్తే ఇప్పుడు నిరాకరిస్తున్నారని బాధితులు సోమవారం రామవరంలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిని కలిసి విన్నవించుకున్నారు. దీంతో ఎక్స్‌గ్రేషియా ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు.

చంద్రశేఖరస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో చంద్రశేఖరస్వామి

రంగంపేట: చండ్రేడు గ్రామంలో కొలువైయున్న కాత్యాయనీ సమేత చంద్రశేఖర స్వామి వారికి ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం



దాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

పెదపూడి: మండలంలోని జి.మామిడాడ ఫొటో, వీడియోగ్రాఫర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 185వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కెమెరా సృష్టికర్త లూయిస్ జాక్విస్ మాండే దాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా పలువురు అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఫొటో, వీడియోగ్రాఫర్లు అందరూ ఐక్యతతో ముందుకు సాగినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఫొటోగ్రఫీ వృత్తిలో వస్తున్న ఆధునిక మార్పులకు అనుగుణంగా నైపుణ్యాన్ని పెంపొందించుకుని ప్రతిభతో ఫొటోలు తీయాలని ఆకాంక్షించారు. అనంతరం సీనియర్ ఫొటో, వీడియోగ్రాఫర్లను సత్కరించుకున్నారు.

జక్కంపూడి విజయలక్ష్మి పరామర్శ



వెలుగుబందలో పరామర్శిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: వెలుగుబంద, చక్రద్వారబంధం గ్రామాలలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు వైఎస్సార్ సీపీ సానుభూతిపరులను ఆ పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి సోమవారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ

సీతానగరం: తహసీల్దార్‌గా ఎ.శ్రీనివాస్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయన కాకినాడ జిల్లా గోకవరం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయనకు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

పోరాట పటిమే సత్తి వీర్రెడ్డి బలం



సత్తి వీర్రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

పెదపూడి: రాజకీయాల్లో ఎటువంటి పరిస్థితులు ఎదురైనా సరే పోరాట పటిమే సత్తి వీర్రెడ్డికి బలంగా నిలిచిందని పలువురు వక్తలు అన్నారు. అనపర్తి మండలం రామవరంలో సత్తి వీర్రెడ్డి 4వ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కుమారులు సత్తి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి సుబ్బిరెడ్డిల ఆధ్వర్యంలో వీర్రెడ్డి కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ వీర్రెడ్డి జీవించినంతకాలం రాజకీయాల్లో నిబద్ధతతో పనిచేశారన్నారు. ఆయన జీవితం ఎందరికో ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో కాకినాడ టౌన్ బ్యాంక్ డైరెక్టర్ సత్తి రామారెడ్డి, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు ఆదాడి చిన సత్యనారాయణ, మండల వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి నల్లమిల్లి వెంకటరెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ గొలుగూరి గోవిందరెడ్డి, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడిమెట్ల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నిందితుడు

రాజానగరం: వృద్ధురాలి మెడలో సుమారు రూ.లక్ష విలువ చేసే బంగారు గొలుసును దొంగిలించిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ ఎస్‌పీ వీరయ్యగౌడ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మేడిశెట్టి సూర్యాకాంతం తన భర్త మృతితో ఒంటరిగా ఉండలేక, మేనల్లుడి ఆసరాతో చక్రద్వారబంధంలోని ఒక తాటాకింట్లో ఉంటుంది. ఎప్పటిలాగే ఈ నెల 16 తెల్లవారుజామున మేనల్లుడు సీతాఫలాల తోటలోకి వెళ్లాడు. ఆ వృద్ధురాలు ఒంటరిగా ఉందని గమనించిన రాయుడు అప్పారావు (పండు) వెంటనే అక్కడకు చేరుకుని, ఆమె మెడలో ఉన్న రెండు కాసుల బంగారు గొలుసును బలవంతంగా లాక్కున్నాడు. ఇదే క్రమంలో ఆమె చెవిదుద్దులు కూడా లాగడంతో ఒక చెవికి గాయమైంది. చెవి దుద్దులు వదిలేసి, బంగారు గొలుసుతో పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదుతో అప్పారావును అరెస్ట్ చేశామని సీఐ తెలిపారు. కోర్టు అతనికి రిమాండ్ విధించిందన్నారు.

ఘనంగా రాఖీ పండగ



అనపర్తిలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి రాఖీ కడుతున్న సర్పంచ్ వారా కుమారి తదితరులు

పెదపూడి: నియోజకవర్గంలో సోమవారం రాఖీ పౌర్ణమి సందర్భంగా అక్కాచెల్లెళ్లు తమ సోదరులకు రాఖీ కట్టి రాఖీ పండగను ఘనంగా జరుపుకున్నారు. అనపర్తిలో స్థానిక సర్పంచ్ వారా కుమారి, తేతలి కళావతి, ఇమ్మంది విజయకుమారి, చింతా శ్రీదేవి తదితరులు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ సోదరీమణులకు తాను అన్ని వేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. సోదర ప్రేమకు ప్రతీకగా ఈ రక్షాబంధన్ నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని అక్కాచెల్లెళ్లందరికీ రాఖీ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు.

రక్షాబంధన్ వేడుక

బిక్కవోలు: శ్రావణ పౌర్ణమి సందర్భంగా సోమవారం రాఖీ పండగను మండలంలో వేడుకగా జరుపుకున్నారు. వివిధ డిజైన్ల రాఖీలతో సోదరుల ముంజేతులు మెరిశాయి. ఆడపడుచులు తమ అన్నదమ్ములకు తొలుత నుదుట బొట్టు పెట్టి, ఆపై ముంజేతులకు రాఖీ కట్టారు. నిండు నూరేళ్ళు సుఖసంతోషాలతో వర్థిల్లాలంటూ హారతులు పట్టారు. చెల్లెమ్మలు, అక్కయ్యలు రాఖీలు కట్టిన వెంటనే అన్నదమ్ములు బహుమతులు అందజేశారు. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుంటూ ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. చిన్న పిల్లలతో పాటు పెద్దలు కూడా ఈ పండగను ఎంతో సంతోషంగా నిర్వహించుకున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కోటికేశవరంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ

మధురపూడి: కోరుకొండ మండలంలో పలు రోడ్లు, మురుగునీటి కాలువలు, తాగునీటి పథకాల నిర్మాణాలకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సోమవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం నిధులతో ఈ నిర్మాణాలు చేపట్టనున్నట్టు తెలిపారు. గాదరాడ – కణుపూరు, కోటికేశవరం – బొల్లెద్దుపాలెం, పాతమునగాల – కొత్త మునగాల, గాదరాడ – నందరాడ వరకూ పది కిలోమీటర్ల రోడ్లు నిర్మిస్తామన్నారు. కార్యక్రమాలలో టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ చౌదరి, కోటికేశవరం సర్పంచ్ ముడే సింధూ దివ్య, గ్రామాల సర్పంచులు, వైఎస్సార్ సీపీ, నాయకులు ముడే కామేశ్, పంచాయతీరాజ్ శాఖ డీఈ రవికుమార్, ఏఈ సత్యప్రకాశ్ పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ల పోస్టులు భర్తీ

సీతానగరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా పనిచేయడానికి ఆసక్తి, అర్హత కలిగిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ సీహెచ్ దొరబాబు తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ ఎంపీసీలో గణితం బోధించడానికి ఎమ్మెస్సీలో 50 శాతం, సీఈటీ గ్రూపు కోసం బీటెక్ సివిల్ 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. దరఖాస్తులనుఈ నెల 24 సాయంత్రం 5 గంటల లోపు కళాశాలలో అందించాలన్నారు.

కారు ఢీకొని మోటారు సైకిలిస్టు మృతి



ఘటనా స్థలంలో తీవ్రగాయాలతో సూర్యప్రకాశరావు

సీతానగరం: బంధువుల ఇంటికి వచ్చి తిరిగి వెళుతున్న వ్యక్తిని కారు ఢీకొంది. ఈ ఘటనలో అతడు తీవ్ర గాయాలపాలై మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. అల్లూరి సీతారామరాజు జిల్లా ఏటిపాక మండలం నెల్లిపాకలో నివాసం ఉంటున్న కరుటూరి సూర్యప్రకాశరావు (72) సోమవారం ఉదయం కాటవరంలోని తన బావమరిది మద్దిపాటి మునేశ్వరరావు ఇంటికి వచ్చాడు. అతడి స్వగ్రామం కూడా కాటవరం కావడంతో తన బంధువులు, స్నేహితులను కలిశాడు. అనంతరం సాయంత్రం 4.30 గంటలకు బీసీ కాలనీ వద్ద ఉన్న టీస్టాల్‌లో టీ తాగి తన బైక్‌పై రాజమహేంద్రవరం వైపు వెళ్లడానికి యూటర్న్ తీసుకున్నాడు. అదే సమయంలో రాజమహేంద్రవరం నుంచి వస్తున్న కారు వెనుక నుంచి అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సూర్యప్రకాశరావు కుడికాలు నుజ్జునుజ్జు అయిపోయింది. తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న ఎస్సై ఫణిమోహన్ సంఘటనా స్థలానికి చేరుకుని చేరుకుని కారును సీతానగరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. సూర్యప్రకాశరావు భార్య ఏడాది క్రితం మరణించింది. అతడికి వివాహమైన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రూ.2.30 లక్షల విలువైన గంజాయి స్వాధీనం



గంజాయి, నిందితులతో సెబ్ అధికారులు

రాజమహేంద్రవరం రూరల్: మోటారు సైకిళ్లపై గంజాయిని తరలిస్తున్న ముఠాను దివాన్ చెరువు జీరో పాయింట్ వద్ద సెబ్ అధికారులు పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి 46.81కిలోల గంజాయి, మూడు మోటారు సైకిళ్లు ,రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ఒడిశాలోని నాగులూరు నుంచి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి మూడు మోటార్ సైకిళ్లపై నలుగురు గంజాయిని తరలిస్తున్నారు. జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆఫీసర్ పిట్టా సోమశేఖర్‌కు వచ్చిన సమాచారం మేరకు సెబ్ అధికారులు తనిఖీ చేశారు. ఉదయం 11.30 గంటల సమయంలో గంజాయి ముఠాను పట్టుకున్నారు. ఒడిశాలోని కలిమేల మండలం నాగులూరుకు చెందిన శంకం రాజుబాబు, పశ్చిమ గోదావరి జిల్లా ఉండి గ్రామానికి చెందిన గళ్ల ఐజాక్ రాజులను అదుపులోకి తీసుకున్నారు. ఒడిశాకు చెందిన వేలుసేరి బుజ్జిబాబు, వేలుసేరి వెంకి పరారీలో ఉన్నారన్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.2.30 లక్షల ఉంటుందని సెబ్ సౌత్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ తెలిపారు. తనిఖీలో ఇన్‌చార్జి అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్, డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ టి.గోపాలకృష్ణ, సౌత్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ, ఎస్సైలు దుర్గాప్రసాద్, శ్రీనివాస్, డీటీఎఫ్ ఎస్సై ఆర్.క్రాంతి కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బలరామ జయంతి



ఇస్కాన్‌లో బలరామ జయంతి నిర్వహిస్తున్న శివానంద నిమాయదాస్ తదితరులు

సీటీఆర్ఐ: శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలలో భాగంగా సోమవారం బలరామ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆర్యాపురంలోని శ్రీకృష్ణ చైతన్య మిషన్ ఆశ్రమం, గోదావరి గట్టున గల ఇస్కాన్ ఆలయాలలో వైభవంగా ఈ కార్యక్రమం జరిగింది. ఆశ్రమ వ్యవస్థాపకుడు శ్రీల త్రిదండి స్వామి భక్తి వైభవ పూరీ గోస్వామి మహారాజ్, శ్రీల ఆచార్యదేవ శ్రీ త్రిదండి స్వామి భక్తి కమల గోవింద గోస్వామి మహారాజ్ దివ్య ఆశీసులతో త్రిదండి స్వామి భక్తి కంకణ బన మహారాజ్ చేతుల మీదుగా ఉదయం గోపూజ మహోత్సవం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన భగవద్గీత పోటీలలో పాల్గొన్న 200 మందికి సర్టిఫికెట్లు అందజేసినట్లు ఆశ్రమం ఇన్‌చార్జి శ్రీపాద హరిదాస్ బ్రహ్మచారి తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు, దాతలు పాల్గొన్నారు. ఇస్కాన్‌లో బలరామ జయంతి సందర్భంగా ప్రత్యేక ప్రవచనాలు, విశ్వశాంతి యజ్ఞం, ప్రత్యేక పుష్పాభిషేకం నిర్వహించారు. ఈ కమిటీ చైర్మన్ శివానంద నిమాయదాస్, శ్యామాంగ నిమాయదాస్, హేమంగా నిమాయదాస్ పాల్గొన్నారు.

ఆర్టీసీలో హెవీ డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం



శిక్షణ తీసుకుంటున్న వారితో డిపో మేనేజర్ షేక్ షబ్నం

రాజమహేంద్రవరం సిటీ: ఆర్టీసీలోని హెవీ వాహనాల డ్రైవింగ్ శిక్షణకు సంబంధించిన 12వ బ్యాచ్ లో 20 మందికి సోమవారం నుంచి శిక్షణ ప్రారంభించినట్లు డిపో మేనేజర్ షేక్ షబ్నం తెలిపారు. వీరిలో 14 మందికి లైట్ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉందని, వారు హెవీ వాహనాల డ్రైవింగ్ లైసెన్స్ కోసం చేరారన్నారు. ఆరుగురికి హెవీ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉందని, డ్రైవింగ్‌లో మంచి నైపుణ్యం పెంపొందించుకోవడం కోసం వీరు చేరారన్నారు. ఇప్పటి వరకూ శిక్షణ కళాశాలలో 188 మంది శిక్షణ పొంది, పేరెన్నిక గన్న వివిధ రంగాలలో ఉపాధి పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ అజయ్ బాబు, మెకానికల్ ఇంజినీర్ ఈశ్వరరావు, డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ వీఎస్ఎల్ రావు, డ్రైవింగ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ హరిబాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలిపై దాడి



దాడి ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

కంబాలచెరువు: హోంవర్క్ చేయలేదని మందలించిన ఉపాధ్యాయురాలిపై విద్యార్థిని కుటుంబ సభ్యులు దాడి చేశారు. వివరాల్లోకి వెళితే.. లాలాచెరువు మున్సిపల్ హైస్కూల్ మట్టా సరితా రంజని గణితం ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఆమె సోమవారం ఉదయం పదో తరగతి విద్యార్థులకు లెక్కల పాఠాలు చెబుతున్నారు. ఆ సమయంలో నిహారిక అనే విద్యార్థినిని హోం వర్క్ చేయకపోవడంతో మందలించారు. నిహారిక ఆ విషయాన్ని ఇంటికి ఫోన్ చేసి చెప్పింది. దీంతో ఆమె తల్లిదండ్రులు, మేనమామ పాఠశాలకు వచ్చిన పాఠం చెబుతున్న సరితా రంజనిపై దాడి చేశారు. విషయం తెలుసుకున్న ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు స్కూలు వద్దకు చేరుకుని ఆరా తీశారు. అనంతరం మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థిని కుటుంబ సభ్యులపై ఫిర్యాదు చేశారు.

పంచలోహ ఉత్సవ విగ్రహాల సమర్పణ



ఉత్సవ విగ్రహాలను ఆలయానికి తీసుకువెళుతున్న షర్మిలారెడ్డి దంపతులు

సీటీఆర్ఐ: స్థానిక క్వారీ మార్కెట్ ఎంఎస్ఆర్ నగర్‌లోని కళ్యాణిదేవి సమేత సోమలింగేశ్వరస్వామి ఆలయానికి స్వామివారి పంచలోహ ఉత్సవ విగ్రహాలను రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి దంపతులు సోమవారం అందజేశారు. ముందుగా మేళతాళాలతో ఉత్సవ విగ్రహాలను ఆలయానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా షర్మిలారెడ్డి మాట్లాడుతూ మేడపాటి సీతారామరెడ్డి ఆధ్వర్యంలో ఆలయాన్ని నిర్మించారని, ఆయన జ్ఞాపకార్థంగా ఈ ఉత్సవ విగ్రహాలను అందచేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో అనిల్‌కుమార్ రెడ్డి, హంసిని శ్రీయారెడ్డి, అభినవ్ సిద్ధార్థ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాంపేట బ్యాంక్ చైర్మన్‌గా జయకుమార్



ప్రమాణ స్వీకారం చేస్తున్న చైర్మన్ బొమ్మన జయకుమార్, డైరెక్టర్లు

రాజమహేంద్రవరం సిటీ: ది జాంపేట కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ పాలక మండలి ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయని ఎన్నికల అధికారి ఎం.జగన్నాథరెడ్డి తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ బ్యాంకు చైర్మన్‌గా బొమ్మన జయకుమార్, వైస్ చైర్మన్‌గా రొబ్బి విజయశేఖర్ ఎన్నికయ్యాయన్నారు. రాష్ట్రంలో 10 బ్రాంచ్‌లలో కొనసాగుతున్న ఈ బ్యాంక్‌లో 27,724 మంది ఖాతాదారులున్నారన్నారు. చైర్మన్, వైస్ చైర్మన్ల ఎంపిక పూర్తి కావడంతో బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్లుగా ఎం.లక్ష్మణరావు, గుంటముక్కల సత్యనారాయణ ప్రసాదరావు, జామిశెట్టి గాంధీ, ద్వారా పార్వతి సుందరి, నాగేశ్వరరావు కనకం, ప్రసాదుల హరనాథ్, బీరా శ్రీనివాసరావు, బూరా రామచంద్రరావు, యాండ్రపు రామకృష్ణ, జామి కృష్ణలతో ప్రమాణ స్వీకారం చేయించినట్లు తెలిపారు.